
సాక్షి
సిద్దిపేట
బుధవారం | 3 | మే | 2023



ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాను అత్యాధునిక టెక్నాలజీ సాయంతో పట్టుకున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. మంగళవారం వివరాలు వెల్లడించారు. 8లో



బ్రహ్మోత్సవాలకు సిద్ధం

వర్గల్ వేణుగోపాల స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. 13 రోజులు పాటు జరిగే వేడుకలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. 9లో

క్రమబద్ధీకరణ గడువు పెంపు

సిద్దిపేటరూరల్: జీఓ 58, 59 కింద భూ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నెల రోజులు గడువు పొడిగించినట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. మే 2 నుంచి మే 31 వరకు అర్హులైన వారు మీ సేవా ద్వారా దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. జిల్లాలోని అర్హులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రైతుకు కష్టకాలం



మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలు



ధాన్యం కుప్పలపై కప్పిన కవర్‌పై నిలిచిన వర్షపు నీరు

- వెంటాడుతున్న అకాల వర్షాలు
- జిల్లాలో 92వేల ఎకరాల్లో పంట నష్టం
- కొనుగోళ్లు త్వరగా చేపట్టాలని వేడుకోలు

సాక్షి, సిద్దిపేట: అకాల వర్షాలు అన్నదాతను నిండా ముంచాయి. పంట చేతికందే సమయంలో కురిసిన వడగండ్లతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మార్చి 18 నుంచి జిల్లాలో ఏదో చోట ఈదురు గాలులు, వడగళ్లవానతో పంటలకు నష్టం జరుగుతోంది. యాసంగి పంటకు సాధారణంగా వర్షాల ముప్పు తక్కువగా ఉంటుంది. కానీ ఈ సారి పంట చేతికందే సమయానికి అకాల వర్షాలకు వడ్లు పొలంలోనే రాలిపోయాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 53,423 మంది రైతులకు చెందిన 92,715.27 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా.

జిల్లా వ్యాప్తంగా..

- వర్షాలతో జిల్లా వ్యాప్తంగా 92,71,5.27 ఎకరాల పంట నష్టం జరిగింది.
- మద్దూరు, చేర్యాల, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ మండలాల్లో ఎక్కువగా నష్టం వాటిల్లింది.
- గతంలో జిల్లాలో 1,146.11 ఎకరాలు నష్టపోయినట్లు అధికారులు లెక్క తెల్చారు. ఇందులో మొక్కజొన్న 1069.18 ఎకరాలు, సన్‌ఫ్లవర్ 66.37, వరి 9.36 ఎకరాలు ఉన్నాయి.
- పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మార్చిలో సీఎం కేసీఆర్ ప్రకటించిన పంట నష్ట పరిహారం ఇప్పటి వరకు రైతులకు అందలేదు.

పంట	ఎకరాలు	రైతులు
వరి	82,205.36	48,017
మొక్కజొన్న	2,214.18	2,409
సన్‌ఫ్లవర్	87.37	103
మామిడి	6,556	2,072
కూరగాయలు	1,634	817
బొప్పాయి	17	05
మొత్తం	92,715.27	53,423

- తాజాగా మార్చి 21వరకు పంట నష్టపోయిన వారి వివరాలను అధికారులు సేకరించి, ప్రభుత్వానికి నివేదించారు.
- 17శాతం కంటే తేమ తక్కువగా ఉంటేనే కొనుగోలు చేస్తామని కేంద్రాల నిర్వాహకులు చెబుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

154 కేంద్రాలు మాత్రమే..

జిల్లావ్యాప్తంగా యాసంగిలో 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ధాన్యం సేకరణకు 418 కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటి వరకు 154 కేంద్రాలను మాత్రమే ప్రారంభించారు. వీటి ద్వారా 175 మంది రైతుల దగ్గరి నుంచి 1,350 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా 264 కేంద్రాల అవసరం ఉంది. పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

15 రోజులైతంది



మూడు ట్రాక్టర్లలో వడ్లు తీసుకువచ్చా. తేమ ఎక్కువ ఉందని కొనుగోలు చేయడంలేదు. ఓ వైపు కురుస్తున్న వర్షాలతో ఆందోళనగా ఉంది. రాత్రి కురిసిన వర్షానికి వడ్లు తడిసి మొలకలు వస్తున్నాయి.

– ఇస్తారీ మల్లు, ఎన్సాన్‌పల్లి

ఇంకా కొంటలేరు



13 రోజుల క్రితం వడ్లను కేంద్రానికి తీసుకువచ్చా. ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాం. తడిసిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలి. అధికారులు స్పందించి త్వరగా కొనుగోళ్లు జరపాలి.

–స్వామి, సిద్దిపేట

న్యూస్‌రీల్

పూసల కులస్తులను ఎంబీసీలో చేర్చండి



మాట్లాడుతున్న వెంకటేశం

హుస్నాబాద్: పూసల కులస్తులను ఎంబీసీ జాబితాలో చేర్చాలని సిద్దిపేట జిల్లా పూసల సంఘం అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం కోరారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పూసల కులస్తులకు ఉపాధి నిమిత్తం ప్రత్యేక పథకం ప్రవేశపెట్టాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి పూసల కులస్తుల బాగు కోసం ఏర్పాటు చేసిన కృష్ణ బలిజ పూసల ఫెడరేషన్‌కు ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని ఆరోపించారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్రకోల పరమేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు గుంటిపల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పాదిల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు గుంటిపల్లి అజయ్ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ పుస్తకం పంపిణీ చేయాలి



వినతిపత్రం అందిస్తున్న డీఎస్పీ నాయకులు

సిద్దిపేటరూరల్: భారత రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ప్రతీ పౌరుడికి ఉచితంగా రాజ్యాంగ గ్రంథాన్ని ప్రభుత్వం పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు రవిబాబు కోరారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. సామాన్య ప్రజలు అవకాశాలు, అంతస్తుల్లో ముందడుగు వేసేందుకు రాజ్యాంగంపై అవగాహన అవసరమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సదన్, రాజు, జ్యోతి, లక్ష్మణ్, సురేష్, మండలాల అధ్యక్షులు ఎల్లన్న, యాదగిరి, కనకరాజు, శ్రీకాంత్‌వ నాయకులు పాల్గొన్నారు.

'భోగ్' గుర్తింపుపై హర్షం



వర్గల్ సిద్ధాంతిని సత్కరిస్తున్న సంతోష్‌గుప్తా

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవిద్యాసరస్వతి టెంపుల్‌కు 'భోగ్' గుర్తింపు దక్కడంపై ఆలిండియా వైశ్య ఫెడరేషన్ యువజన విభాగం అధ్యక్షుడు సంతోష్‌గుప్తా హర్షం చేశారు. మంగళవారం వర్గల్ క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతిని కలిసి సత్కరించారు. సిద్ధాంతి కృషి, పట్టుదలకు ఇది నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వైశ్య సంఘ నాయకులు శ్రీనివాస్, సూర ఆంజనేయులు, గంగిశెట్టి సుధాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపు

సిద్దిపేటరూరల్: ఈ నెల 11, 18, 25 తేదీల్లో సదరం క్యాంపును నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఆర్‌డీఓ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట కోమటిచెరువు వద్ద ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రతీ గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుదన్నారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు హాజరు కావాలని సూచించారు.

ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడొచ్చు

పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: అత్యవసరంలో అందించే ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చని పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. గ్రీన్ హెల్త్ సర్వీసెస్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది, యువతకు ఫస్ట్ రెస్పాండెంట్ ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై శిక్షణ, అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన సీపీ మాట్లాడుతూ.. రోడ్డు సేఫ్టీపై ఈఎంఆర్ఐ కోఆర్డినేషన్‌తో పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ అందిస్తున్నాని తెలిపారు. స్నేహితులు, బంధువులు, ఇతరులు ఎవరైనా ప్రమాదాల భారిన పడినపుడు ప్రథమ చికిత్సతో కాపాడవచ్చని అన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు వాహన తనిఖీ చేపడతామని, ప్రతీ ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. విడతల వారీగా పది రోజుల పాటు శిక్షణ ఉంటుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రథమ చికిత్స, వెన్నునొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ నొప్పి, డిహైడ్రేషన్, అతిసారం, ఫిట్స్, మూర్చ, తలనొప్పి, పక్షవాతం, పాముకాటు, ఆత్మహత్య తదితర సమయాల్లో అందించే ప్రథమ చికిత్సపూ ఈఎంఆర్ఐ ప్రతినిధి మధు, టెక్నికల్ నవీన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, ప్రాక్టికల్‌గా వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, సిద్దిపేట రూరల్ సీఐ జానకిరామ్ రెడ్డి, దుబ్బాక సీఐ కృష్ణ, తొగుట సీఐ కమలాకర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటితో పుష్కరాల ముగింపు



మంజునాథస్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం

మెదక్ రూరల్: మెదక్ మండలం పేరూరు శివారులోని సరస్వతీఆలయం వద్ద జరుగుతున్న పుష్కరాలు మంగళవారంతో 11వరోజుకు చేరుకున్నాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించి సరస్వతీమాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మకు పసుపు, కుంకుమలతో వాయినాలు సమర్పించి శ్రాద్ధకర్మలు, పిండ ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేత, హైకోర్టు న్యాయవాది తాళ్లపల్లి రాజశేఖర్ పుష్కర ఘాట్‌లో పుణ్యస్నానం చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు రాజమౌళి శర్మతో పాటు ప్రధాన పూజారులు గుణాకర్‌శర్మ, మహేష్ శర్మలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రంతో 12 రోజులు పూర్తి చేసుకొని పుష్కరాలు ముగియనున్నాయి. ముగింపు వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా నాచగిరీశుని జయంత్యుత్సవాలు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రంలో స్వామివారి జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రెండోరోజు ఉదయం 9 గంటలకు యాగశాల ప్రవేశం నిర్వహించారు. అర్చకస్వాములు మంత్రోచ్చరణలతో మూర్తికుంభ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, సుదర్శన నారసింహ మూలమంత్ర హవనములు చేసి, పూర్ణాహుతి జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

జూన్ 2న ఐటీ టవర్ ప్రారంభం

- యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం
- ఐటీ కంపెనీ ప్రతినిధుల సమావేశంలో మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరింపజేస్తూ స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జూన్ 2న సిద్దిపేటలో ఐటీ టవర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో పలు ఐటీ కంపెనీలతో మంత్రి సమావేశమై మాట్లాడారు. సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కృషితో కరీంనగర్, వరంగల్, ఖమ్మంలో ఐటీ టవర్లు ఏర్పాటయ్యాయని, ఎంతో మంది యువత ఉద్యోగాలు పొందారని అన్నారు. సిద్దిపేటలో 718 సీటింగ్ కెపాసిటీతో నిర్మించిన ఐటీ టవర్‌లో భాగస్వామ్యం అయ్యేందుకు ఐటీ కంపెనీలు ముందుకు రావడం సంతోషకరం అన్నారు. నెట్ విజన్, జోలాస్ టెక్, విజన్ టెక్, అమిడాయ్ ఎడ్యుటెక్, ఫిక్సిటీ టెక్నాలజీస్, ఇన్నోసోల్ వంటి కంపెనీలు 300 మందికి పైగా యువతకు ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు. సిద్దిపేట ఐటీ టవర్‌లో భాగస్వామ్యమయ్యే కంపెనీలకు రెండేళ్ల పాటు నిర్వహణ, అద్దె, విద్యుత్, ఇంటర్నెట్ బిల్లుల భారం లేకుండా చూస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో సిద్దిపేట ఐటీ టవర్ ఏర్పాటవుతుందని, సమీపంలో త్రీస్టార్ హోటళ్లు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, పెద్ద సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా పలు ఐటీ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ రాయితీలు ప్రకటించిన మంత్రి హరీశ్ రావుకు అభినందనలు తెలిపారు. సిద్దిపేట అభివృద్ధి గురించి విన్నామని, తప్పకుండా భాగస్వామ్యం అవుతామని తెలిపారు. తెలంగాణ ఐటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈఓ విజయ్ రంగినేని మాట్లాడుతూ తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా యువతకు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అమిడ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అలుగు ముత్యం, ఫిక్సిటీ టెక్నాలజీస్ డెలివరీ హెడ్ శ్రీకాంత్ కోట, ఇన్ సొల్యూషన్స్ ప్రతినిధులు బస్వ శేఖర్ శంషాబాద్, రాశి, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అండ

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రఘుందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో దివ్యాంగులకు మంగళవారం ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దివ్యాంగులకు వంద శాతం సబ్సిడీపై ట్రై సైకిళ్లను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారుల లిస్టును రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తే కేంద్రం నిధులు విడుదల చేస్తుందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లన్నగారి శాంతవ్వ, బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు, నాయకులు భిక్షపతి, సంతోష్, అమర్, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మిరుదొడ్డి మండలం మల్లుపల్లిలో వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సిద్దిపేట ప్రాజెక్టు



ప్రాజెక్టుతో అధ్యాపకులు, విద్యార్థినులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ తెలిపారు. ఫిజిక్స్ అధ్యాపకుడు కిషోర్ పర్యవేక్షణలో సెకండియర్ విద్యార్థినిలు చండి, వైష్ణవి, మానస, శివాని, అన్నపూర్ణ చేసిన 'ధ్వని ద్వారా విద్యుత్ శక్తి ఉత్పత్తి' ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ఎంపికైందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారాములు, విద్యార్థినిలు ప్రాజెక్టును గురించి వివరించారు. ఈసందర్భంగా విద్యార్థినులను అభినందించి, పరిశోధనలపై ఆసక్తిని పెంచుకుని మరిన్ని ఆవిష్కరణలు చేయాలన్నారు. విద్యార్థినులను వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి తదితరులు విద్యార్థినిలను అభింనదించారు.

అలరిస్తున్న చిత్రలేఖనం

- ఆసక్తి చూపుతున్న చిన్నారులు
- ఆకట్టుకుంటున్న చిత్రాలు



శిబిరానికి హాజరైన విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చిట్టి చేతులతో చిన్నారులు వేసే చిత్రలేఖనం చూపరులను ఆకట్టుకుంటోంది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కాకతీయ ఈ టెక్నో హైస్కూల్‌లో పది రోజుల పాటు నిర్వహిస్తున్న ఉచిత చిత్ర లేఖన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ప్రతీ రోజు ఉదయం 9 నుంచి 10గంటల వరకు ప్రముఖ చిత్రకారులు రుస్తుం, నహీం రుస్తుంలు విద్యార్థులకు చిత్రలేఖనంలో మెళకువలు నేర్పిస్తున్నారు. ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని సాక్షి నిర్వహిస్తున్న శిబిరంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆసక్తిగా నేర్చుకుంటున్నారు



చిత్రలేఖన శిక్షణ విజయవంతంగా కొనసాగుతోంది. విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. రోజు గంటపాటు చిత్రలేఖనంలో మెళకువలు నేర్పిస్తున్నాం. సులువుగా చిత్రలేఖనం వేయడానికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

– నహీం రుస్తుం, శిక్షకుడు

బొమ్మలు వేయడం తెలిసింది



శిబిరంలో బొమ్మలు వేసే పద్ధతిని నేర్పించారు. ఇంతకుముందు కంటే ఇపుడు సులువుగా బొమ్మలు వేయగలుగుతున్నా. నాతో పాటు మా చెల్లి కూడా శిబిరానికి వచ్చింది. చిత్రలేఖన మెటీరియల్ కూడా ఉచితంగా అందించారు.

– వంశిఖ, 7వ తరగతి

మంచిగా రంగులు వేస్తున్నా



గీసిన చిత్రాలకు రంగులు వేయడం ఎలాగో తెలుసుకున్నా. శిక్షణలో అందించిన మెళకువలతో ఇబ్బంది లేకుండా రంగులు వేస్తున్నా. అన్ని రకాల చిత్రాలు వేసేలా శిక్షణ అందిస్తున్నారు.

– మన్విత్, 4వ తరగతి



చెరువును తలపిస్తున్న దుబ్బాక మార్కెట్ యార్డు



తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

దంచికొట్టిన వాన

అకాల వర్షం రైతులను వదలడం లేదు. మంగళవారం ఉదయం దుబ్బాక మండలంలో ఈదురు గాలులతో కూడిన వాన కురిసింది. కొనుగోలు కేంద్రాలు, పొలాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసింది. ఉదయం కురిసిన వానకు దుబ్బాక మార్కెట్ యార్డు నీటితో చెరువుగా మారింది. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 10 రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 2వేల క్వింటాళ్ల ధాన్యం యార్డుకు రాగా, వర్షాలకు దాదాపు 1500 క్వింటాళ్ల ధాన్యం తడిసింది.

– దుబ్బాక

క్లుప్తంగా

హాల్ టికెట్ ఒకరిది.. పరీక్ష రాసేది ఇంకొకరు

ఇరువురిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: ఓపెన్ టెన్త్ పరీక్షల్లో ఓ విద్యార్థి బదులు మరో విద్యార్థి పరీక్ష రాసేందుకు యత్నించిన ఘటనలో పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ పదో తరగతి పరీక్షల్లో ఖేల్‌కు చెందిన యూనుస్ అనే విద్యార్థికి బదులు సోమవారం సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్ష రాయబోయిన ఫలక్‌నుమాకు చెందిన బాలుడిని పరీక్ష గదికి వెళ్లే ముందు నిర్వహించిన తనిఖీలో పోలీసులు పట్టుకున్నారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని రాజీవ్ రహదారిపై తమ సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 17 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి వారికి రూ.38,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

మనోహరబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన కాళ్లకల్ శివారులో జాతీయరహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కామారెడ్డికి చెందిన సాయి అతడి కుటుంబ సభ్యులు ఆటోలో హైదరాబాద్ వైపునకు వెళ్తున్నారు. ఆటో ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ఆటో లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో సాయి తల్లి మల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి.

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

- పోలీసులమని చెప్పి మోసానికి పాల్పడుతున్న వైనం
- సూర్యాపేట జిల్లావాసులుగా గుర్తింపు
- వివరాలు వెల్లడించిన సీపీ శ్వేత



వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట సీపీ శ్వేత.చిత్రంలో ఏసీపీ రమేష్ తదితరులు

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యులతో కూడిన సైబర్ ముఠాను అత్యాధునిక టెక్నాలజీ సాయంతో గుర్తించి వారిలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ శ్వేత వివరాలు వెల్లడించారు.

- మార్చి13వ తేదీన జిల్లాలోని ములుగు మీ సేవ సెంటర్ నిర్వాహకుడికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఏఎస్‌ఐ అశోక్‌రెడ్డి మాట్లాడుతున్నానని అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయని నమ్మబలికాడు. ఆ మాటలను నమ్మిన అతను గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా ఘటకేసర్ దగ్గర్లోని మీ సేవ సెంటర్‌కు ఆన్‌లైన్‌లో రూ.25వేలు పంపించాడు.
- మరో ఘటనలో ఏప్రిల్ 7వ తేదీన దుబ్బాక మీ సేవసెంటర్ నిర్వాహకుడికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ఏఎస్‌ఐ మాట్లాడుతున్నానని అత్యవసరంగా డబ్బులు అవసరం ఉందని నమ్మించాడు. ఆ మాటలు విని మీ సేవనిర్వాహకుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా ఓ పెట్రోల్ బంక్‌కు రూ.20వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు.
- ఏప్రిల్ 19వ తేదీన వర్గల్ మీ సేవ సెంటర్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి స్థానిక పోలీసులం మాట్లాడుతున్నామని తమకు అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయని వసస్థలిపురం పెట్రోల్ బంక్‌కు నగదు పంపాలని సూచించారు. ఆ మాటలు నమ్మిన మీ సేవ సెంటర్ నిర్వాహకుడు ఆన్‌లైన్‌లో కొంత మొత్తం పంపించాడు.

ఆయా ఘటనల్లో మోసపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీ శ్వేత, గజ్వేల్ ఏసీపీ రమేష్, గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, దుబ్బాక సీఐ కృష్ణ, గౌరారం ఎస్‌ఐ సంపత్, కానిస్టేబుళ్లు మహేశ్, పర్శరాములు, ఐటీ కోర్ కానిస్టేబుల్ శ్రీకాంత్‌లతో స్పెషల్ టీం ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది విచారణలో భాగంగా మార్చి13వ తేదీన ములుగు మీ సేవ సెంటర్ నిర్వాహకుడు పంపించిన డబ్బులను తీసుకోవడానికి వెళ్లిన సైబర్ నేరస్తుడి కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. సూర్యాపేటకు చెందిన కట్కూరి సాయిశరత్ రెడ్డి ప్రైవేటు ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసం ఉంటునట్లు చెప్పాడు. చేస్తున్న ఉద్యోగం వదిలిపెట్టి విలాసవంతమైన జీవితం కోసం సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో అదేజిల్లాకు చెందిన మొబైల్ షాప్ నిర్వాహకుడు ఎండీ నవీద్ తో కలిసి ఓఎల్‌ఎక్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 2018లో కరీంనగర్ జిల్లాలో పలు మోసాలకు పాల్పడ్డామని చెప్పాడు. పలు మోసాల్లో ఐదు కేసుల్లో కరీంనగర్ పోలీసులు సాయిశరత్ రెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. బెయిల్‌పై విడుదలైన సాయిశరత్ ఆన్‌లైన్ మోసాలకు ఆకర్షితుడై నవీద్ మరో ఐదుగురు మిత్రులు ఆకుల కిరణ్, వేశవరపు శివసాయి, గార్లపాటి సుమంత్, పాడపత్రం రణధీర్, మధులతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు గత మార్చి నుంచి జిల్లాలో ముగ్గురు మీ సేవసెంటర్ నిర్వాహకులకు ఫోన్ చేసి పోలీసులమని చెబుతూ తమకు అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయని నమ్మించి ఆన్‌లైన్‌లో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఇదే తరహాలో వీరు ఖమ్మం, నేలకొండపల్లి, ఎల్లారెడ్డి, బోధన్, దుబ్బాక, కల్వకుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ మోసాలకు పాల్పడినట్లు సీపీ శ్వేత తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మరో 34 కేసులు ఎన్‌సీఆర్‌బి సైబర్ పోర్టల్‌లో కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని సీపీ పేర్కొన్నారు. అందులో కట్కూరి సాయిశరత్‌రెడ్డి, ఎండి నవీద్‌ను అరెస్టు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఆమె తెలిపారు. మరో ఐదుగురు నిందితులు కిరణ్, శివసాయి, సుమంత్, రణధీర్, మధు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అత్యాధునిక టెక్నాలజీ సాయంతో నేరస్తుల గుర్తింపు

అత్యాధునిక టెక్నాలజీ సాయంతో సైబర్ నేరస్తులను గుర్తించామని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ విషయంలో సిబ్బందిని సీపీ అభినందించారు. సైబర్ నేరగాళ్లు ఎక్కువగా ఆశచూపో, భయపెట్టో మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులకు, సామాజిక మాధ్యమాల్లో పంచుకోకూడదని సీపీ సూచించారు.

గోడ కూలి మహిళ దుర్మరణం


శిథిలాల కింద అనూష


అనూష (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): గోడ కూలి మహిళ దుర్మరణం పాలైన ఘటన అక్కన్నపేట మండలం, గుడాటిపల్లి గ్రామ పరిధిలోని సోమాజితండాలో చోటుచేకుంది. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం..హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన బదనాపురం అనూష(30)వార్డు మెంబర్‌గా ఎన్నికైనప్పటికీ బతుకుదెరువు కోసం ఇనుప సామాన్లు ఏరుకొని అమ్ముకోవడం, భర్త కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పనులు చివరిదశకు చేరుకోవడంతో అక్కడ వారం రోజులుగా అనూష ఇనుప సామాన్లను ఏరుకుంటుంది. సోమవారం కూడా ఓ ఇంట్లో ఇనుప సామాన్లను ఏరడానికని వెళ్లి తిరిగి రాలేదు. భర్త, కుటుంబీకులు ఫోన్ చేసినా ఆమె స్పందించలేదు. మంగళవారం భర్త, అత్త, బంధువులు గుడాటిపల్లి ముంపు గ్రామాల్లో వెతికారు. మధ్యాహ్నం సోమాజితండాలో పాడుబడిన ఇల్లు గోడకూలిన శిథిలాల్లో విగతజీవిగా కనిపించింది. దీంతో ఆమెను చూసిన బంధువులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. భర్త తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వివేక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): ఇటుక బట్టీ వద్ద ఆడుకుంటుండగా ఓ బాలిక అదృశ్యమైన ఘటన గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..ఒడిషా రాష్ట్రం బోలింగర్ జిల్లా, పట్నంఘర్‌లోని, జోలెన్ బార్ గ్రామానికి చెందిన చిత్రుసావర్, భనీతసావర్‌లు రవిబాబు నడిపిస్తున్న ఇటుక బట్టీలో పనులు చేసేందుకు ఐదు నెలల క్రితం వచ్చి స్థిరపడ్డారు. వీరి ఇద్దరి పిల్లలతో పాటు తొమ్మిదేళ్ల కాజల్‌ను కూడా తోడు తెచ్చుకున్నారు. గత నెల 30న కాజల్ ఆడుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. సమీపంలో ఎంత వెతికినా బాలిక ఆచూకీ తెలియలేదు. ఈ విషయాన్ని భనీతసావర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ విజయకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దళిత బంధు యూనిట్ల తనిఖీ


తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి

గజ్వేల్: గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన 'దళిత బంధు' యూనిట్లు పొంది వివిధ వ్యాపారాలను నిర్వహించుకుంటున్న తీరును మంగళవారం గజ్వేల్‌లో 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి తనిఖీ చేశారు. రెడీమేడ్, హార్డువేర్ షాపులు ఇతర వ్యాపారాలు నిర్వహిస్తూ ఎంత ఆదాయం పొందుతున్నారో ? వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నెలనెలా మంచి ఆదాయం పొందుతున్నామని తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించగలుగుతున్నామని 'గడా' అధికారికి వారు వివరించారు. ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేవిధంగా దళిత బంధును సద్వినియోగం చేసుకోవాలని ముత్యంరెడ్డి వారికి సూచించారు.

పౌరసరఫరా అధికారుల తనిఖీలు


చేర్యాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణ కేంద్రంలోని కడవేర్గు రోడ్డులోని రాజస్థాన్ స్వీట్ హౌజ్‌లో ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువకు అమ్ముతున్నారని తెలంగాణ కన్స్యూమర్ ఫోరం చేర్యాల మండల అధ్యక్షుడు జి.రవి కుమార్ ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం జిల్లా తునికల, కొలతల అధికారి శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో కలిసి సంబంధిత స్వీట్ హౌజ్‌ను తనిఖీ చేశారు. వారిని విచారించిన అనంతరం ఎమ్మార్పీధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారని తేలడంతో యజమానిపై కేసు నమోదు చేసినట్లు అధికారి తెలిపారు.

ఆన్‌లైన్‌లో సైబర్ మోసం

- ఇద్దరికి రెట్టింపు నగదు ఆశ చూపి..
- రూ.31,60,000లు అపహరణ



పటాన్‌చెరు టౌన్: రెట్టింపు నగదు ఇస్తామని ఆశ చూపి ఆన్‌లైన్‌లో ఇద్దరు వ్యక్తుల నుంచి పెద్ద ఎత్తున నగదు సైబర్ నేరగాళ్లు దోచుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ఏప్రిల్ 20వ తేదీన వాట్సాప్‌లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన మెసేజ్‌కు స్పందించాడు. ఇందులో పెట్టుబడి పెట్టి టాస్క్ పూర్తి చేస్తే రెట్టింపు నగదు ఇస్తామని ఆశచూపారు. వారి మాటలు నమ్మిన బాధితుడు ఏడు రోజుల పాటు రూ.30లక్షల వరకూ పెట్టుబడి పెడుతూ వచ్చాడు. ఇచ్చిన టాస్క్‌లన్నీ పూర్తి చేశాడు. అనంతరం పెట్టిన నగదుతో పాటు రెట్టింపు నగదు ఇవ్వాలని సదరు బాధితుడు కోరాడు. ఆ వ్యక్తుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. వెంటనే బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు.

మరోఘటనలో

అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన ఓ వ్యక్తి ఏప్రిల్ 15న తన ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు 16వ తేదీన వివరాలు నమోదు చేసి రూ.1,60,000లు పెటాడు. ఇచ్చిన టాస్కుల అనంతరం తిరిగి నగదు చెల్లించమని అడగగా స్పందించలేదు. దీంతో తను కూడా సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేశాడు. ఆ తరువాత అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువురి ఫిర్యాదులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వడియారం శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వడియారం గ్రామానికి చెందిన గుండ్ల బాబు(27) ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం తను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమీప బంధువునకు ఫోన్‌లో సమాచారం చేరవేశాడు. దీంతో అతను వడియారం శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఆత్మహత్య విషయాన్ని రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. రైల్వే ఎస్‌ఐ తావూ నాయక్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.


గుండ్ల బాబు (ఫైల్)

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

ద్విచక్రవాహనాలు అదుపు తప్పి చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చౌటకూరు మండలంలో జరిగింది. పుల్కల్ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నారాయణ ఖేడ్ పట్టణానికి చెందిన సందిప్ గౌడ్(18) ఏప్రిల్24 నారాయణఖేడ్ నుంచి ఐపీఎల్ మ్యాచ్ చూడడానికి బైక్‌పై హైదరాబాదుకు వెళ్లి వస్తున్న క్రమంలో చౌటకూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో నేషనల్ హైవేపై ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అక్కడి వారు 108లో అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్సనిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిద్దిపేటఅర్బన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట పట్టణంలో మంగళవారం జరిగింది. సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం..ప్రశాంత్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన బండి లింగయ్య (30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పని కోసం తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. పని ముగించుకొని వస్తున్న క్రమంలో హరిహర రెసిడెన్సీ కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి అంబులెన్స్ ద్వారా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: వేసవి సెలవుల్లో పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. దీంతో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. సరదా కోసం చెరువులు.. బావులకు ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. లేదంటే ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను మైనర్లకు ఇవ్వొదన్నారు.

'సూరంపల్లి సర్పంచ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి'

దుబ్బాక: అంబేడ్కర్ జయంతిలో పాల్గొన కుండా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించారని వెంటనే సర్పంచ్ నర్సింలును సస్పెండ్ చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం దౌల్తాబాద్ ఎంపీడీఓ రాజేష్ కుమార్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జయంతిలో సర్పంచ్, ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించినందుకు తన స్థాయిని మరచి బూతులు తిట్టాడని ఆరోపించారు.

కారు ఢీ కొని వ్యక్తి..


ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

న్యాల్‌కల్(జహీరాబాద్): కారు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గంగ్వార్ గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బీదర్ జిల్లా యాకత్‌పూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ సమద్(55) తన మనుమడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో న్యాల్‌కల్ మండల పరిధిలోని గంగ్వార్ గ్రామ సమీపంలో గల సాహెబ్ వద్దకు వచ్చాడు. కూతురిని, మనుమడిని అక్కడ దించి తిరిగి వెళ్తున్న క్రమంలో వెనకాల నుంచి అతి వేగంగా కారు బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో అబ్దుల్ సమద్‌కి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అబ్దుల్ సమద్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్ సందర్శించారు. మృతుడి కుమారుడు ఎండీ ఇలియాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత


సిద్దిపేట కమాన్: సెల్‌ఫోన్ అందజేస్తున్నసీఐ రవికుమార్



గజ్వేల్ రూరల్: సెల్‌ఫోన్ అందజేస్తున్న సీఐ వీరప్రసాద్

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్‌తో గుర్తించి సిద్దిపేట టూటౌన్ పోలీసులు బాధితుడికి అందజేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పెద్దమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన దేవిరెడ్డి తన సెల్‌ఫోన్‌ను ఏప్రిల్ 22వ తేదీన పట్టణంలో పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. అనంతరం ఫోన్ ఆచుకీ తెలుసుకొని రికవరీ చేశారు. బాధితుడిని మంగళవారం పిలిపించి సీఐ రవికుమార్ అందజేశారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

గజ్వేల్‌రూరల్‌లో..

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తిరిగి అప్పగించినట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన చిక్కుడు యాదగిరి వారంరోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఫోన్‌కు సంబంధించిన వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేసి అనంతరం ఫోన్ ఆచూకీ తెలుసుకొని బాధితునికి అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీ

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని రెండు ఆలయాల్లో సోమవారం చోరీ జరిగింది. పాండచెరువు కట్టపై ఉన్న కల్యాణ రామచంద్రస్వామి, గొల్పర్తి పెద్దమ్మ ఆలయ తాళాలు పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడుతోపాటు నగదు అపహరించుకపోయారు. క్లూస్‌టీం వివరాలు సేకరించారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఝరాసంగం(జహీరాబాద్): కూరగాయలు అమ్ముతున్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును తెంపుకొని పారిపోతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మండల పరిధిలోని సంఘం(కె) గ్రామానికి చెందిన పట్లోళ్ల విట్టమ్మ ఝరాసంగంలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు సంతలో టమాటాలు అమ్ముతుంది. ఈ క్రమంలో కొండాపూర్ మండల పరిధిలోని తొగర్ పల్లి గ్రామానికి చెందిన బి. నర్సింలు టమాటాలు కావాలని అడిగాడు. ఆమె టమాటాలు ఇస్తున్న క్రమంలో మెడలో నుంచిపుస్తెలతాడు తెంచుకొని పారిపోతుండగా స్థానికులు అతన్ని పట్టుకున్నారు. దేహశుద్ధి అనంతరం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేందర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

స్థల వివాదంలో ఘర్షణ

నలుగురికి తీవ్ర గాయాలు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో ఓ స్థల వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. మంగళవారం జోగిపేట సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సర్వేనెంబర్ 174లోని భూమిలో చాలా కాలంగా ఇరు వర్గాల మధ్య గొడవ జరుగుతుంది. ఆ స్థలంలో పట్టణానికి చెందిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ సయ్యు మహేష్, అతని కుమారుడు తేజ ఆ స్థలంలో నిర్మాణం చేపడుతుండగా హనుమంతరావుపేట సంపత్ గౌడ్, సాయినాథ్ గౌడ్‌లు పని నిలిపివేయాలని వారిని కోరారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాట మాట పెరిగింది. ఒకరిపై మరొకరు దాడులకు దిగారు. డీఎస్పీ మహేష్ కుమారుడు తేజ సంపత్, సాయినాథ్‌పై దాడి చేయడంతో తలకు, కాలు, చేయి, దవడకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తేజను సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సీఐ నాగరాజు పరిశీలించారు.

పరస్పరం ఫిర్యాదులు

డీఎస్పీ సయ్యు మహేష్, అతని కొడుకు తేజా తమపై ఇనుప రాడ్లు, నేకల్ పంచుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని రామాగౌడ్ జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై కూడా రామాగౌడ్, ప్రవీణ్ గౌడ్, సంపత్ గౌడ్, ప్రదీప్ గౌడ్‌లతోపాటు పదిమంది దాడి చేసినట్లు సయ్యు మహేష్ న్యాయవాది ద్వారా జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై హత్యాయత్నం కేసు


ఘర్షణ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ నాగరాజు





జోగిపేటలో భూ వివాదానికి సంబంధించి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు జోగిపేట ఎస్‌ఐ-2 జయశంకర్ తెలిపారు. సంపత్‌గౌడ్, సాయినాథ్‌గౌడ్‌లపై దాడి జరిపిన కేసులో తేజ, డీఎస్పీ మహేష్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. డీఎస్పీ మహేష్ చేసిన ఫిర్యాదుతో నలుగురితో పాటు మరికొంతమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో విచారణ జరిపి తగుచర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

నలుగురికి గాయాలు

కొల్చారం(నర్సాపూర్): రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని నలుగురికి గాయాలైన సంఘటన మండల కేంద్రం సమీపంలోని మెదక్-నర్సాపూర్ జాతీయ రహదారి లోతువాగు మూల మలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా బాలానగర్‌కు చెందిన నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై ఏడుపాయల వనదుర్గాదేవిని దర్శించుకునేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో లోతు వాగు సమీపంలోకి రాగానే, బైకులు అదుపుతప్పి ఒకరినొకరు ఢీ కొన్నారు. దీంతో నలుగురికి గాయాలు కాగా వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.